


# BNS
BHARAT NEWS SPECTRUM

## ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్




సంపుటి - 01 సంచిక - 47 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ 20-02-2026 శుక్రవారం పేజీలు : 6

# తెలంగాణ బడ్జెట్ సమావేశాలు

- బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి 26 నుంచి
- ఆర్థిక శాఖ తుది సిద్ధత
- ప్రజా సంక్షేమ, వ్యవసాయం ప్రాధాన్యం
- 15 రోజుల చర్చలు, బిల్లుల ఆమోదం
- శాఖలవారీ కేటాయింపులు
- రీజినల్, రేడియల్ రోడ్ల ఫండింగ్
- ఇంధన, గృహజ్యోతి నిధులు
- రైతుభరోసా, ఇందిరమ్మ పథకాలకు కేటాయింపు

మిగతా 2 లో




**న్యూస్ డెస్క్,19 ఫిబ్రవరి (బిఎన్ఎస్)**

తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలకు రంగం సిద్ధమైంది. ఫిబ్రవరి 26 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారభించాలని రేవంత్ ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఈనెల 23న తెలంగాణ కేబినెట్ సమావేశం కానుండగా.. ఆ భేటీలో దీనిపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ మేరకు కసరత్తు పూర్తి చేసిన ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలకు తుది మెరుగులు దిద్దుతున్నారు. ఈనెల 28న ఆర్థిక మంత్రి హోదాలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నట్లు తెలిసింది.

# మండలిలో 'విజిల్' రగడ

## : పోడియం వద్ద వైసీపీ సభ్యుల హంగామా

- హెరిటేజ్ - ఇందాపూర్ వివాదంపై చర్చకు పట్టు.. వాయిదా తీర్మానం తిరస్కరణ
- సభలో విజిల్స్ వేయడంపై మంత్రి అచ్చెన్నాయుడు ఆగ్రహం.. సభ వాయిదా




అమరావతి (బిఎన్ఎస్) : ఆంధ్రప్రదేశ్ శాసనమండలి వేదికగా గురువారం అధికార తెలుగుదేశం మరియు ప్రతిపక్ష వైసీపీ సభ్యుల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటుచేసుకుంది. బడ్జెట్ సమావేశాల సందర్భంగా వరుసగా మూడో రోజు కూడా సభలో గందరగోళ పరిస్థితి నెలకొంది. తిరుమల లడ్డూ నెయ్యి సరఫరాకు సంబంధించి 'హెరిటేజ్ - ఇందాపూర్ డెయిరీ' అంశంపై చర్చ జరపాలని వైసీపీ సభ్యులు పట్టుబట్టడంతో సభ రసాభాసగా మారింది.




# ప్రభుత్వానిది ధన దాహం.. అందుకే ప్రసాదంపై అపవాదు

## : బొత్స సత్యనారాయణ

అమరావతి, (బీఎన్ఎస్) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం, తమ వ్యాపార సామ్రాజ్యాల అభివృద్ధి కోసం భక్తుల సెంటిమెంట్లతో ఆడుకుంటోందని శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం మండలి సమావేశాలు వాయిదా పడిన అనంతరం మీడియా పాయింట్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ అంశంపై చర్చకు ప్రభుత్వం తోకముడిచిందని, నిజాన్ని నిర్భయంగా చెప్పే ధైర్యం ముఖ్యమంత్రికి లేదని ఎద్దేవా చేశారు.


# గత పాపాలను కడుగుతున్నాం.. ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నాం!

అమరావతి, ఫిబ్రవరి 19 (బిఎన్ఎస్): "మేము ప్రవేశపెట్టింది కేవలం అంకెల పద్దు కాదు.. ఆంధ్రప్రదేశ్ ఉజ్వల భవిష్యత్తుకు వేసిన పునాది" అని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి గానూ శాసనసభలో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌పై జరిగిన మూడు రోజుల చర్చకు గురువారం ఆయన ముగింపు సమాధానం ఇచ్చారు. గత ఐదేళ్ల కాలంలో రాష్ట్రం ఎదుర్కొన్న ఆర్థిక అరాచకత్వాన్ని, విధానపరమైన వైఫల్యాలను ఎండగడుతూనే, కూటమి ప్రభుత్వం చేపట్టిన పునర్నిర్మాణ చర్యలను ఆయన వివరించారు.




# తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త మలుపు

## 'తెలంగాణ జాగృతి' పార్టీని ప్రకటించిన కవిత!





హైదరాబాద్, ఫిబ్రవరి 19 (బీఎన్ఎస్) : తెలంగాణ రాజకీయ యవనికపై మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. భారత్ రాష్ట్ర సమితి అధినేత కె. చంద్రశేఖర్ రావు కుమార్తె, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత సొంతంగా రాజకీయ పార్టీని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించి రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించారు. గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న ఆమె, గురువారం తన అనుచరులు మరియు తెలంగాణ జాగృతి కార్యకర్తలతో నిర్వహించిన భారీ భేటీలో ఈ సంచలన నిర్ణయాన్ని వెల్లడించారు.

పార్టీ అజెండా: మహిళా శక్తి & తెలంగాణ హక్కులు

కొత్త పార్టీ పేరును 'తెలంగాణ జాగృతి పార్టీ' గా ఆమె నామకరణం చేసినట్లు సమాచారం.

# చంద్రబాబు పాలనలో 'రెడ్ బుక్' రాజ్యమేలుతోంది: జగన్ నిప్పులు




అమరావతి, ఫిబ్రవరి 19 (బిఎన్ఎస్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని, చంద్రబాబు నాయుడు నేతృత్వంలో 'రెడ్ బుక్' రాజ్యాంగం అమలు జరుగుతోందని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. గురువారం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు.

లడ్డూ వివాదం.. అంతా డ్రామా!

తిరుమల లడ్డూ ప్రసాదంపై కూటమి ప్రభుత్వం కావాలనే విష ప్రచారం చేసిందని జగన్ మండిపడ్డారు. "భక్తుల సెంటిమెంట్లతో ఆడుకోవడం చంద్రబాబుకు అలవాటు. తన కుటుంబ సంస్థ 'హెరిటేజ్' ప్రయోజనాల కోసం, ఇందాపూర్ డెయిరీపై అపనిందలు వేశారు. ఇప్పుడు సిట్ నివేదిక సిద్ధంగా ఉన్నా, అందులో నిజాలు బయటకు వస్తాయనే భయంతో ప్రభుత్వం దానిని దాచిపెడుతోంది. దైవ దర్శనాల విషయంలో కూడా రాజకీయాలు చేయడం దారుణం" అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

# తలవంచి క్షమాపణలు కోరుతున్నా

- రవీంద్రభారతిలో భావోద్వేగ ప్రసంగం
- పూర్వీకుల పాపాలపై క్షమాపణ
- కన్నీటి పర్యంతమైన రచయిత
- తండ్రి ఉదారతను స్మరణ
- చిన్ననాటి స్నేహితుడి గుర్తింపు




న్యూస్ డెస్క్, 19 ఫిబ్రవరి (బిఎన్ఎస్): ప్రముఖ సినీ రచయిత, రాజ్యసభ సభ్యుడు విజయేంద్ర ప్రసాద్ తాజాగా చేసిన వ్యాఖ్యలు సామాజిక వర్గాల్లో పెను సంచలనం సృష్టిస్తున్నాయి. తన పూర్వీకుల చరిత్రను గుర్తు చేసుకుంటూ ఆయన వ్యక్తం చేసిన పశ్చాత్తాపం చర్చనీయాంశంగా మారింది.

# 'రంజాన్' మాసం ప్రారంభం




హైదరాబాద్ (బీఎన్ఎస్) : ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లిం సోదరులు అత్యంత పవిత్రంగా భావించే 'రంజాన్' మాసం ప్రారంభమైంది. ఆకాశంలో నెలవంక దర్శనమివ్వడంతో మత పెద్దలు (రుహియత్ ఎ హిలాల్ కమిటీ) పవిత్ర మాసారంభాన్ని ప్రకటించారు. దీంతో దేశవ్యాప్తంగా ఉన్న మసీదులు విద్యుత్ కాంతులతో వెలిగిపోతుండగా, ముస్లిం వాడల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# ఏఐ మంత్రం.. 'మానవ్' సూత్రం: ప్రపంచానికి భారత్ దిశానిర్దేశం!




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19 (బిఎన్ఎస్): "ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అనేది రెండు వైపులా పదునున్న కత్తి లాంటిది. దీనిని సరైన దిశలో వాడితే అద్భుతమైన ఫలితాలు వస్తాయి, లేదంటే ప్రమాదకరంగా మారుతుంది. ఏఐ మానవాళిని శాసించే స్థాయికి వెళ్లకూడదు, మనిషే ఏఐని నియంత్రించేలా ఉండాలి" అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో గురువారం ప్రారంభమైన 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026'లో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు.

# హస్తినలో రేవంత్ టీమ్‌కు శుభాభినందనలు




న్యూఢిల్లీ (బీఎన్ఎస్): తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తన మంత్రివర్గ సహచరులతో కలిసి దేశ రాజధాని ఢిల్లీలో జరిపిన పర్యటన రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. గురువారం ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ మరియు కె.సి. వేణుగోపాల్‌లతో జరిగిన సుదీర్ఘ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు సమాచారం.

మున్సిపల్ విక్టరీ - హైకమాండ్ ఫుల్ ఖుషీ

రాష్ట్రంలో ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 90 శాతం స్థానాలను కైవసం చేసుకోవడంపై అధిష్టానం హర్షం వ్యక్తం చేసింది. ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి బలంగా వెళ్తున్నాయని, ఇదే జోరును కొనసాగించాలని రాహుల్ గాంధీ సూచించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ఒక సమగ్ర నివేదికను అందజేశారు.

# మండలిలో 'విజిల్' రగడ

## : పోడియం వద్ద వైసీపీ సభ్యుల హంగామా

మొదటి పేజీ తరువాయి

సభ ప్రారంభం కాగానే వైసీపీ ఎమ్మెల్సీలు రమేష్ యాదవ్, బొమ్మి ఇజ్రాయెల్, మొండితోక అరుణ్ కుమార్‌లు తమ వాయిదా తీర్మానాన్ని చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు తిరస్కరించడంపై నిరసన వ్యక్తం చేశారు. సభ మధ్యలోకి దూసుకెళ్లి ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వంపై నినాదాలు చేశారు. ఈ క్రమంలో కొందరు వైసీపీ సభ్యులు చైర్మన్ పోడియం వద్దే విజిల్స్ వేస్తూ హంగామా సృష్టించడం సభలో కలకలం రేపింది. 'పెద్దల సభ'గా పిలిచే మండలిలో విజిల్స్ వేయడంపై అధికార పార్టీ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

చీజ్‌కు, నెయ్యికి తేడా తెలియదా? : మంత్రి అచ్చెన్నాయుడు

వైసీపీ సభ్యుల తీరుపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రంగా మండిపడ్డారు. ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ప్రెస్ మీట్‌లో చీజ్ ప్యాకెట్‌ను చూపించి నెయ్యి ప్యాకెట్ అని అబద్ధపు ప్రచారం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. "చీజ్‌కి, నెయ్యికి తేడా తెలియని ప్రతిపక్షం ఉండటం మన దౌర్భాగ్యం. హెరిటేజ్ సంస్థపై ఆధారాలు ఉంటే సభలో చూపాలి. ప్రభుత్వం గంటల తరబడి చర్చించడానికి సిద్ధంగా ఉంది. కానీ మీరు కావాలనే సభా సమయాన్ని వృథా చేస్తున్నారు," అని మంత్రి సవాల్ విసిరారు.

బొత్స వర్సెస్ పార్థసారథి

చర్చ సందర్భంగా వైసీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ మరియు మంత్రి పార్థసారథి మధ్య కూడా మాటల యుద్ధం నడిచింది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిని కప్పిపుచ్చుకోవడానికే వైసీపీ ఇలాంటి ఆందోళనలు చేస్తోందని మంత్రి ఆరోపించారు. సభలో క్రమశిక్షణ తప్పి విజిల్స్ వేయడం సభా మర్యాదలకు విరుద్ధమని స్పష్టం చేశారు.

సభలో గందరగోళం ముదరడంతో చైర్మన్ సభను కొద్దిసేపు వాయిదా వేశారు. సభలోకి విజిల్స్ ఎలా వచ్చాయనే అంశంపై అసెంబ్లీ భద్రతా సిబ్బంది ఆరా తీస్తున్నారు.

# ప్రభుత్వానిది ధన దాహం.. అందుకే ప్రసాదంపై అపవాదు: బొత్స సత్యనారాయణ

మొదటి పేజీ తరువాయి

హెరిటేజ్ – ఇందాపూర్ లింకులేంటి?



గత ప్రభుత్వ హయాంలో తిరుమలకు నెయ్యి సరఫరా చేసిన 'ఇందాపూర్ డెయిరీ'కి, ప్రస్తుత ముఖ్యమంత్రి కుటుంబ సంస్థ అయిన 'హెరిటేజ్'కు మధ్య ఉన్న వ్యాపార సంబంధాలను బయటపెట్టాలని బొత్స డిమాండ్ చేశారు. "తమ ధన దాహం కోసం, సొంత కంపెనీల లాభం కోసం పవిత్రమైన లడ్డూ ప్రసాదంలో కొవ్వు కలిసిందని అభాండాలు వేశారు. ఇప్పుడు చర్చకు రమ్మంటే సభలో గందరగోళం సృష్టించి పారిపోతున్నారు. సిట్ నివేదికలో ఏముందో ప్రజలకు ఎందుకు చెప్పడం లేదు?" అని ప్రశ్నించారు.

టీటీడీ చైర్మన్‌కు హితవు

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) చైర్మన్ బీఆర్ నాయుడు తీరుపై బొత్స తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. "నాయుడు గారూ.. మీరు టీటీడీకి చైర్మన్ అని గుర్తుంచుకోండి. ఒక పార్టీ కార్యకర్తలా లేదా టీడీపీ ప్రతినిధిలా మాట్లాడటం మీకు తగదు. పవిత్రమైన ఆలయ ప్రతిష్టను దెబ్బతీయకండి" అని హితవు పలికారు. ఆలయ వ్యవహారాల్లో రాజకీయ జోక్యం మితిమీరిపోయిందని విమర్శించారు.

ప్రజా సమస్యలను గాలికొదిలేశారు

రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, మాజీ మంత్రులు, వైసీపీ నేతలపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. "రెండు సంవత్సరాల పాలన పూర్తవుతున్నా, నేటికీ గత ప్రభుత్వంపై నెపం నెట్టడమే పనిగా పెట్టుకున్నారు తప్ప, ప్రజలకు ఏం చేశారో చెప్పడం లేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతు భరోసా వంటి పథకాలను అటకెక్కించారు" అని దుయ్యబట్టారు.

పెద్దల సభలో గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని, విపక్ష సభ్యులు వాయిదా తీర్మానం ఇస్తే కనీసం చర్చకు కూడా అనుమతించకుండా సభను వాయిదా వేయడం ప్రజాస్వామ్యాన్ని పరిహసించడమేనని బొత్స సత్యనారాయణ మండిపడ్డారు.

# గత పాపాలను కడుగుతున్నాం.. ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నాం!

మొదటి పేజీ తరువాయి

అప్పుల కుప్ప నుంచి ఆశావాదం వైపు..

గత ప్రభుత్వం వదిలివెళ్లిన రూ. 9.75 లక్షల కోట్ల అప్పులు, రూ. 1.35 లక్షల కోట్ల పెండింగ్ బిల్లుల భారాన్ని మోస్తూనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తున్నామని పయ్యావుల పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో 12.3 శాతం వడ్డీతో తెచ్చిన అప్పులను, ప్రస్తుతం తమ ప్రభుత్వం 9 శాతం లోపు వడ్డీకే పునశ్చరణ (=వలవస్త్రశేఱ్ఖవ) చేసి, రాష్ట్ర ఖజానాకు ఏటా రూ. 327 కోట్లకు పైగా ఆదా చేస్తోందని గణాంకాలతో వివరించారు.

బడ్జెట్ ముఖ్యాంశాలు – మంత్రి వివరణ:

సూపర్ సిక్స్ అమలు: సూపర్ సిక్స్ హామీల అమలుకు బడ్జెట్‌లో సింహభాగం కేటాయించామని, 'తల్లికి వందనం', 'అన్నదాత సుఖీభవ' వంటి పథకాలకు ఎక్కడా నిధుల కొరత లేదని భరోసా ఇచ్చారు.

అమరావతి & పోలవరం: రాజధాని అమరావతి నిర్మాణానికి రూ. 57,868 కోట్ల పనులను మంజూరు చేశామని, పోలవరం పనులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చామని తెలిపారు.

ఆదాయ వృద్ధి: 2024–25లో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ 11.75 శాతం వృద్ధి రేటును నమోదు చేయడం శుభపరిణామమని, ఇది పెట్టుబడిదారులకు రాష్ట్రంపై ఉన్న నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు.

వెల్త్ ఫండ్: రాష్ట్రం కోసం సొంతంగా సంపదను సృష్టించేందుకు రూ. 100 కోట్ల ప్రాథమిక మూలధనంతో 'ఏపీ వెల్త్ ఫండ్'ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.

ప్రతిపక్షంపై విమర్శనాస్త్రాలు..

చీజ్‌కు, నెయ్యికి తేడా తెలియని వారు ఆర్థిక వ్యవస్థ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని మంత్రి ఎద్దేవా చేశారు. వైసీపీ సభ్యులు సభలో ఉండకుండా పారిపోయారని, కనీసం నిర్మాణాత్మక సూచనలు చేసే ధైర్యం కూడా వారికి లేదని విమర్శించారు. రాజధాని లేని రాష్ట్రంగా మనల్ని చూసి నవ్విన పరిస్థితి నుంచి, నేడు దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా నిలిపామని గర్వంగా చెప్పారు.మంత్రి సమాధానం అనంతరం సభ బడ్జెట్ మరియు అనుబంధ పద్దులకు అధికారికంగా ఆమోదం తెలిపింది.

# చంద్రబాబు పాలనలో 'రెడ్ బుక్' రాజ్యమేలుతోంది: జగన్ నిప్పులు



మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో 'రౌడీయిజం' రాజ్యమేలుతోంది

గడిచిన కొద్ది నెలలుగా రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ కార్యకర్తలు, నేతలపై దాడులు పెరిగాయని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు.

దాడుల పర్వం: "మాజీ మంత్రుల ఇళ్లను కూల్చివేయడం, కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేయడం ప్రజాస్వామ్యమా? పోలీసు వ్యవస్థను కూడా టీడీపీ కార్యకర్తల్లా వాడుకుంటున్నారు. రెడ్ బుక్ లో పేర్లు రాసుకుని మరీ అధికారులను బెదిరిస్తున్నారు" అని ధ్వజమెత్తారు.

రైతు కష్టాలు: 'అన్నదాత సుఖీభవ' హామీ ఎక్కడికి పోయింది? రుణమాఫీ పేరుతో రైతులను చంద్రబాబు దారుణంగా మోసం చేశారని విమర్శించారు.

అసెంబ్లీలో గొంతు నొక్కే ప్రయత్నం

శాసనసభలో ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని జగన్ దుయ్యబట్టారు. "ప్రతిపక్ష నేత హోదా ఇవ్వకపోతే మేము అసెంబ్లీకి రాము అనుకుంటున్నారేమో.. ప్రజల సమస్యలపై నిలదీయడానికి సభలో అడుగుపెడతాం. మైక్ కట్ చేసినా, గొంతు నొక్కినా గర్జిస్తూనే ఉంటాం" అని స్పష్టం చేశారు.

సూపర్ సిక్స్ ఎక్కడ?

ఎన్నికల సమయంలో ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని జగన్ విమర్శించారు. తల్లికి వందనం, నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలపై కాలయాపన చేస్తూ ప్రజలను వంచిస్తున్నారని ఎద్దేవా చేశారు. బడ్జెట్‌లో కేటాయింపులు చూస్తేనే అర్థమవుతోంది.. ఈ ప్రభుత్వం ప్రజలకు ఏమీ చేయదలుచుకోలేదని తేల్చి చెప్పారు.

వైసీపీ కార్యకర్తలు ఎవరూ అధైర్యపడవద్దని, ధర్మం మనవైపే ఉందని, త్వరలోనే రాష్ట్రంలో మళ్ళీ ప్రజా ప్రభుత్వం వస్తుందని జగన్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# హస్తినలో రేవంత్ టీమ్‌కు శుభాభినందనలు

మొదటి పేజీ తరువాయి

కేబినెట్ విస్తరణకు ముహూర్తం ఖరారు?

చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న మంత్రివర్గ విస్తరణపై ఈ భేటీలో ప్రధానంగా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఖాళీగా ఉన్న మూడు మంత్రి పదవులను భర్తీ చేయడంతో పాటు, కొన్ని శాఖల మార్పుపై కూడా ముఖ్యమంత్రి హైకమాండ్ అనుమతి కోరారు.

నామినేటెడ్ పదవులు: పార్టీ కోసం కష్టపడిన సీనియర్లకు నామినేటెడ్ పదవుల పంపిణీకి అధిష్టానం పచ్చజెండా ఊపినట్లు తెలుస్తోంది.

మునిసిపల్స్ ఎఫెక్ట్: మునిసిపల్ ఎన్నికల్లో భారీ విజయం మీద హై కమాండ్ సంతృప్తి వ్యక్తం చేసింది. ఇదే తరహాలో ఎమ్ పీ టీ సీ, జడ్ పీ టీ సీ ఎన్నికల్లో పోరాడాలని సూచించింది.

మొత్తం మీద రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ నాయకులంతా టీమ్ వర్క్ చేయాలని హై కమాండ్ స్పష్టం చేసింది. రేవంత్ కు పార్టీ వ్యవహారాలలో మరింత స్వేచ్ఛ ఇచ్చినట్లు సమాచారం.

ప్రధాని మోదీ ఏర్పాటు చేసిన 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్' విందుకు కూడా హాజరైన ముఖ్యమంత్రి, హైదరాబాద్‌ను గ్లోబల్ ఏఐ హబ్‌గా మార్చేందుకు గ్లోబల్ సీఈఓలతో చర్చలు జరపనున్నారు.

# ఏఐ మంత్రం.. 'మానవ్' సూత్రం : ప్రపంచానికి భారత్ దిశానిర్దేశం!



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19 (బిఎన్ఎస్): "ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అనేది రెండు వైపులా పదునున్న కత్తి లాంటిది. దీనిని సరైన దిశలో వాడితే అద్భుతమైన ఫలితాలు వస్తాయి, లేదంటే ప్రమాదకరంగా మారుతుంది. ఏఐ మానవాళిని శాసించే స్థాయికి వెళ్లకూడదు, మనిషే ఏఐని నియంత్రించేలా ఉండాలి" అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో గురువారం ప్రారంభమైన 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026'లో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. గ్లోబల్ సౌత్‌లో (అభివృద్ధి చెందుతున్న దేశాల కూటమి) ఈ స్థాయి ఏఐ సదస్సు జరగడం ఇదే తొలిసారి.

ప్రధాని 'మానవ్' (MANAV) మంత్రం

ఏఐ భవిష్యత్తు కోసం ప్రధాని మోదీ 'MANAV' అనే సరికొత్త ఫ్రేమ్‌వర్క్‌ను ప్రపంచ దేశాల ముందుంచారు. ఇది మానవ కేంద్రిత సాంకేతికతకు దిక్సూచిగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు:

M (Moral): నైతిక విలువలతో కూడిన వ్యవస్థలు.

A (Accountability): జవాబుదారీతనం కలిగిన పాలన.

N (National Sovereignty): డేటా సార్వభౌమత్వం (ఏ దేశ డేటా ఆ దేశంలోనే ఉండాలి).

A (Accessibility): అందరికీ అందుబాటులో ఉండే సాంకేతికత.

V (Validity): చట్టబద్ధమైన మరియు నమ్మదగిన వ్యవస్థలు.

దిగ్గజాల సమాగమం.. మేధో మథనం

ఈ చారిత్రాత్మక సదస్సుకు ప్రపంచవ్యాప్తంగా 500 మందికి పైగా ఏఐ నిపుణులు, 20కి పైగా దేశాధినేతలు హాజరయ్యారు.

ప్రపంచ నేతలు: ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ తదితరులు ప్రసంగిస్తూ భారత్ చేపట్టిన ఈ చొరవను కొనియాడారు.

టెక్ దిగ్గజాలు: గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్, ఓపెన్ ఏఐ (ChatGPT) అధినేత సామ్ ఆల్ట్‌మాన్, మైక్రోసాఫ్ట్ ప్రతినిధులు మరియు రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ ఈ సదస్సులో పాల్గొన్నారు. ఏఐ నియంత్రణ (Regulation) కోసం ప్రపంచవ్యాప్తంగా ఒకే రకమైన నిబంధనలు ఉండాలని సామ్ ఆల్ట్‌మాన్ అభిప్రాయపడ్డారు.

వార్ రూమ్ ఏర్పాటు.. ఎక్స్‌పో పొడిగింపు

ఈ సదస్సుకు సుమారు 3 లక్షల మందికి పైగా రిజిస్ట్రేషన్లు చేసుకోవడంతో భారత్ మండపం జనసందోహంగా మారింది. యువతలో ఉన్న ఉత్సాహాన్ని చూసి కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ హర్షం వ్యక్తం చేశారు. సందర్శకుల రద్దీ దృష్ట్యా, ఈ ఎక్స్‌పోను మరో రోజు పొడిగించి ఫిబ్రవరి 21 (శనివారం) వరకు నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

# 'రంజాన్' మాసం ప్రారంభం

హైదరాబాద్ (బీఎన్ఎస్) : ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లిం సోదరులు అత్యంత పవిత్రంగా భావించే 'రంజాన్' మాసం ప్రారంభమైంది. ఆకాశంలో నెలవంక దర్శనమివ్వడంతో మత పెద్దలు (రుహియత్ ఎ హిలాల్ కమిటీ) పవిత్ర మాసారంభాన్ని ప్రకటించారు. దీంతో దేశవ్యాప్తంగా ఉన్న మసీదులు విద్యుత్ కాంతులతో వెలిగిపోతుండగా, ముస్లిం వాడల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. నేటి తెల్లవారుజాము నుంచే విశ్వాసులు 'సహర్' ముగించుకుని తొలి రోజా (ఉపవాసం) ప్రారంభించారు.

ఆధ్యాత్మిక శిక్షణకు మార్గం.. రంజాన్

ఇస్లాం ఐదు సూత్రాలలో ఉపవాసం (రోజా) అత్యంత కీలకమైనది. రంజాన్ మాసం కేవలం ఆహార పానీయాలను త్యజించడం మాత్రమే కాదు.. మనసును, శరీరాన్ని అదుపులో ఉంచుకునే గొప్ప ఆధ్యాత్మిక శిక్షణ అని ముస్లిం పండితులు పేర్కొంటారు.

ఖురాన్ అవతరణ: మానవాళికి మార్గదర్శిగా నిలిచే పవిత్ర ఖురాన్ గ్రంథం ఈ మాసంలోనే అవతరించడంతో దీనికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంది.

తరావీ నమాజ్: రంజాన్ మాసంలో రాత్రిపూట నిర్వహించే 'తరావీ' నమాజ్‌లకు మసీదులు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఇందులో ఖురాన్‌ను పూర్తిగా పఠిస్తారు.

ఉపవాసాల ప్రాధాన్యత: ఆకలి విలువ తెలిసేలా.. రంజాన్ ఉపవాసాలు కేవలం భక్తి కోణంలోనే కాకుండా సామాజిక కోణంలోనూ గొప్ప సందేశాన్ని ఇస్తాయి.

ఆకలి విలువ: రోజంతా ఆకలితో ఉండటం ద్వారా పేదవారి ఆకలి బాధ ఎలా ఉంటుందో ప్రతి ఒక్కరూ ప్రత్యక్షంగా అనుభవిస్తారు. ఇది మనుషుల్లో కరుణను పెంచుతుంది.

జకాత్ – దానగుణం: తన సంపాదనలో కొంత భాగాన్ని పేదలకు పంచాలనే 'జకాత్' మరియు 'ఫిత్రా' పంపిణీ ఈ మాసంలో ముమ్మరంగా జరుగుతుంది. సమాజంలో ఆర్థిక సమానత్వం కోసం ఇస్లాం ఈ నిబంధనను పెట్టింది.

ఆరోగ్య సూత్రం: ఏడాది పొడవునా పనిచేసే జీర్ణవ్యవస్థకు ఈ ఉపవాసాల ద్వారా విశ్రాంతి లభిస్తుందని, ఇది శరీర శుద్ధికి తోడ్పడుతుందని వైద్య నిపుణులు సైతం ధృవీకరిస్తున్నారు.

విశేష ఏర్పాట్లు.. హలీం ఘుమఘుమలు

రంజాన్ రాకతో తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో, ముఖ్యంగా హైదరాబాద్‌లో సందడి మొదలైంది. చారిత్రక చార్మినార్‌తో పాటు మక్కా మసీదు వద్ద భక్తుల కోసం ప్రత్యేక వసతులు కల్పించారు. ఇఫ్తార్ విందుల కోసం ఇప్పటికే హలీం సెంటర్లు సిద్ధమయ్యాయి. రంజాన్ మాసం పొడవునా హిందూ–ముస్లిం సోదరభావానికి ప్రతీకగా నిర్వహించే ఇఫ్తార్ విందులు గంగా–జమునా తెహజీబ్ సంస్కృతిని మరోసారి చాటిచెప్పనున్నాయి.

రాష్ట్ర ముఖ్యమంత్రి మరియు ఇతర ప్రముఖులు ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ నెల రోజుల పాటు జరిగే ప్రార్థనలు దేశంలో శాంతి, సౌభాగ్యాలను నింపాలని ఆకాంక్షించారు.

# తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త మలుపు

## 'తెలంగాణ జాగృతి' పార్టీని ప్రకటించిన కవిత!

మొదటి పేజీ తరువాయి



మహిళా ప్రాధాన్యత: చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు సాధించడమే లక్ష్యంగా, రాష్ట్రంలోని మహిళా ఓటు బ్యాంకును ఏకం చేసే దిశగా పార్టీ అడుగులు వేయనుంది.

అస్తిత్వ పోరాటం: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను రక్షించుకోవడంతో పాటు, కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తామని కవిత స్పష్టం చేశారు.

తండ్రితో విభేదాలా? వ్యూహాత్మక అడుగా? : బీఆర్ఎస్ పార్టీ జాతీయ రాజకీయాల వైపు వెళ్లిన క్రమంలో, రాష్ట్రంలో ప్రాంతీయ అస్తిత్వాన్ని కాపాడేందుకు బలమైన వేదిక అవసరమని కవిత భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, ఈ నిర్ణయం కేసీఆర్ ఆశీస్సులతోనే జరిగిందా లేదా అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. "తెలంగాణ గడ్డపై పుట్టిన బిడ్డగా, ఇక్కడి ప్రజల కష్టాల్లో పాలుపంచుకోవడానికి నాకు సంపూర్ణ హక్కు ఉంది" అని ఆమె పేర్కొనడం గమనార్హం.

ప్రధాన రాజకీయ పార్టీల్లో కలవరం

కవిత కొత్త పార్టీ ప్రకటనతో అటు అధికార కాంగ్రెస్, ఇటు ప్రతిపక్ష బీజేపీ మరియు బీఆర్ఎస్ వర్గాల్లో ఒక్కసారిగా రాజకీయ సమీకరణాలు మారే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో కవితకు ఉన్న పట్టు, జాగృతి సంస్థ ద్వారా ఆమె నిర్మించుకున్న నెట్‌వర్క్ కొత్త పార్టీకి ప్లస్ పాయింట్ కానుంది.

వచ్చే నెలలో హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించి, పార్టీ జెండా, గుర్తు మరియు విధివిధానాలను అధికారికంగా ప్రకటించనున్నట్లు కవిత వెల్లడించారు. ఈ పరిణామం తెలంగాణ రాజకీయాల్లో ఏ మలుపు తిప్పుతుందో వేచి చూడాలి.

# తెలంగాణ బడ్జెట్ సమావేశాలు

మొదటి పేజీ తరువాయి

గత బడ్జెట్ కంటే ఈసారి అన్ని శాఖలకు కేటాయింపులు భారీగా ఉండే అవకాశం ఉందని సమాచారం. ముఖ్యంగా ప్రజా సంక్షేమ పథకాలు, వ్యవసాయం మౌలిక సదుపాయాల కల్పనకు ఈ బడ్జెట్‌లో పెద్దపీట వేయనున్నట్లు తెలుస్తోంది. బడ్జెట్‌పై సభ్యులు సమగ్రంగా చర్చించేందుకు వీలుగా అసెంబ్లీ సమావేశాలను 15 రోజుల పాటు నిర్వహించాలని రేవంత్ ప్రభుత్వం యోచిస్తోంది. శాసనసభ, శాసనమండలిలో ప్రతిపక్షాలు లేవనెత్తే అంశాలకు సమాధానం ఇవ్వడంతో పాటుగా.. పెండింగ్‌లో ఉన్న పలు కీలక బిల్లులను కూడా ఈ సమావేశాల్లోనే ఆమోదించుకోవాలని అధికార పక్షం భావిస్తున్నట్లు సమాచారం.

2025–26కు సంబంధించి పూర్తి స్థాయి బడ్జెట్‌ను గతేడాది మార్చిలో ప్రవేశపెట్టారు. కానీ ఈసారి ఫిబ్రవరిలోనే బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు రెడీ అయ్యారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో రూ.3,04,965 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టారు. రెవెన్యూ వ్యయం రూ.2,26,982 లక్షల కోట్లు కాగా.. మూలదన వ్యయం రూ. 36,504 వేల కోట్లు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తి స్థాయిలో ప్రవేశ పెట్టనున్న బడ్జెట్ ఇదే. ఈసారి బడ్జెట్ మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. శాఖలవారీగా చూస్తే.. అత్యధికంగా వ్యవసాయ రంగానికి రూ. 24,439 కోట్లు, పంచాయతీ ఉ రూరల్ డెవలప్‌మెంట్ రూ.31,605 కోట్లు కేటాయించారు.

గతంలో మాదిరిగానే.. ఈసారి కూడా వ్యవసాయ, పంచాయతీ, రూరల్ డెవలప్‌మెంట్ శాఖలకు పెద్దపీట వేయనున్నట్లు సమాచారం. దాంతో పాటు.. రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రీజినల్ రింగు రోడ్డు, రేడియల్ రోడ్లు, గృహజ్యోతి 200 యూనిట్ల ఫ్రీ కరెంట్ అమలుకు ఇంధన శాఖకు నిధులు కేటాయించనున్నట్లు తెలిసింది.

# తలవంచి క్షమాపణలు కోరుతున్నా..

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన 'మాతా రాంబాయి అంబేడ్కర్ మెమొరియల్ అవార్డుల' ప్రధానోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా విజయేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. 'మాది చాలా సంపన్న కుటుంబం. నాకు తెలిసి నేను ఎప్పుడూ ఏ తప్పూ చేయలేదు. కానీ మా పూర్వీకులు అంటరానితనం పేరుతో నోటితో చెప్పలేనంత దారుణాలకు, భయంకరమైన ఘోరాలకు పాల్పడ్డారు. అవి తలుచుకుంటేనే ఇప్పుడు నాకు సిగ్గుగా ఉంది. ఆ దారుణాలకు ఒడిగట్టిన వారి రక్తమే నాలో ప్రవహిస్తోంది.. వారి ఆస్తులనే నేను అనుభవిస్తున్నాను. అందుకే ఆ పాపాల్లో నేను కూడా భాగస్వామినే. నా పూర్వీకుల తరపున మీ అందరికీ తలవంచి క్షమాపణలు కోరుతున్నా' అంటూ కన్నీటి పర్యంతమయ్యారు.

తన చిన్ననాటి స్నేహం గురించి వివరిస్తూ.. 'నా చిన్ననాటి మిత్రుడు మాల సామాజిక వర్గానికి చెందిన జాన్ ఫ్రెడ్రిక్ సుందర్ రావు. మేమిద్దరం పదో తరగతి వరకు పోటీపడి చదివాం. ఇద్దరం కలిసి లయోలా కాలేజీలో చేరాం. నా తండ్రికి అప్పట్లో కులపిచ్చి, మతపిచ్చి లేదు. ఆ అబ్బాయికి కూడా ఆయనే ఫీజు కట్టి, రూమ్ ఖర్చులు భరించి నాతో పాటు రూమ్‌మేట్‌గా ఉంచారు' అని తన తండ్రి గొప్పతనాన్ని విజయేంద్ర ప్రసాద్ గుర్తుచేసుకున్నారు.

# కొల్లూరు వివాదం

## కొత్త ప్లాట్ యజమానుల వైపే న్యాయం

హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో వేగంగా విస్తరిస్తున్న పట్టణాభివృద్ధి మధ్య భూముల విలువలు ఆకాశాన్నంటుతున్నాయి. అదే సమయంలో పాత రికార్డులు, వారసత్వ హక్కులు, ప్రభుత్వ నోటీసులు, మధ్యవర్తుల ఒప్పందాలు వంటి అంశాలు అనేక ప్రాంతాల్లో వివాదాలకు దారి తీస్తున్నాయి. అలాంటి అత్యంత చర్చనీయాంశమైన కేసుల్లో ఒకటిగా నిలిచింది కొల్లూరు ప్రాంత భూముల వ్యవహారం.

ఈ వివాదంలో ప్రధానంగా నిలుస్తున్న అంశం 1984లో జరిగిన ప్లాట్ల విభజన చట్టబద్ధమేనా?

చట్టపరమైన విశ్లేషణలు, పాత పత్రాలు, రిజిస్ట్రేషన్ వివరాలు పరిశీలిస్తే ఆ విభజన చట్టబద్ధమైనదే అనే వాదన బలంగా వినిపిస్తోంది. అదే కోణంలో పరిశీలిస్తే ఇప్పటి వరకు ప్లాట్లు కొనుగోలు చేసినవారే అసలైన యజమానులని స్పష్టత వస్తోంది.

1984 విభజన ఎలా జరిగింది?

1980ల కాలంలో ఈ ప్రాంతం పూర్తిగా వ్యవసాయ భూమిగా ఉండేది. పట్టణ విస్తరణ భవిష్యత్తులో వస్తుందని భావించిన భూస్వాములు తమ భూములను నివాస ప్లాట్లుగా మార్చాలని నిర్ణయించారు. కుటుంబ సభ్యుల మధ్య హక్కుల స్పష్టత తీసుకొచ్చారు. చట్టబద్ధంగా పంచాయితీ/రెవెన్యూ రికార్డుల్లో విభజన నమోదైంది. తర్వాత లేఅవుట్ రూపంలో ప్లాట్లుగా విభజించారు. కొనుగోలుదారులకు రిజిస్టర్డ్ డాక్యుమెంట్ల ద్వారా విక్రయించారు.

ఈ ప్రక్రియలో జరిగిన ముఖ్యమైన విషయం ఏమిటంటే భూమి ముందుగా చట్టబద్ధంగా భాగాలుగా విడిపోయింది; తర్వాతే అమ్మకం జరిగింది. అంటే అమ్మకం జరిగిన తేదీ కంటే ముందే యాజమాన్య హక్కులు స్పష్టంగా నిర్ణయించబడ్డాయి.

కొనుగోలు చేసినవారే యజమానులని ఎందుకు అంటున్నారు?

చట్టం ప్రకారం యాజమాన్యాన్ని నిర్ణయించడంలో ప్రధానంగా మూడు అంశాలు కీలకం:




1. మూల హక్కు

1984లో విభజన జరిగిన తర్వాత ప్రతి భాగానికి వేర్వేరు హక్కులు ఏర్పడ్డాయి.

అంటే ఆ తరువాత అమ్మిన వ్యక్తి తన భాగాన్నే విక్రయించాడు ఇతరుల హక్కులను కాదు.

2. రిజిస్ట్రేషన్ ఆధారాలు

రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు

పన్నుల చెల్లింపులు

వారసత్వ బదిలీలు

విద్యుత్, మున్సిపల్ కనెక్షన్లు

లాంటివి దశాబ్దాలుగా కొనసాగుతున్నాయి.

ఇవి యాజమాన్యాన్ని బలపరిచే ద్వితీయ ఆధారాలుగా చట్టం గుర్తిస్తుంది.

వివాదం ఎందుకు వచ్చింది?

కాలక్రమేణా భూముల విలువలు భారీగా పెరగడంతో పాత రికార్డులపై కొత్త అభ్యంతరాలు లేవనెత్తబడ్డాయి.

కొన్ని వర్గాలు:

అసలు విభజన సరైనది కాదని

అమ్మకాలు చెల్లవని

తిరిగి హక్కులు వస్తాయని

వాదనలు ప్రారంభించాయి. కానీ ఇక్కడ ప్రధాన ప్రశ్న

విభజన చట్టబద్ధమైతే తర్వాత జరిగిన అమ్మకాలన్నీ కూడా చట్టబద్ధమే అవుతాయి.

చట్టపరమైన కోణం

భూమి వ్యవహారాల్లో కోర్టులు సాధారణంగా ఈ సూత్రాన్ని అనుసరిస్తాయి: “మూల విభజన చెల్లుబాటు అయితే, దాని ఆధారంగా జరిగిన తదుపరి రిజిస్ట్రేషన్లు కూడా చెల్లుబాటు అవుతాయి.”

1984లో విభజన సరైనదిగా నిలిస్తే: కొనుగోలుదారులు చట్టబద్ధ యజమానులు, తరువాతి అభ్యంతరాలు బలహీనమవుతాయి, దీర్ఘకాల స్వాధీన హక్కు మరింత బలపడుతుంది

ప్లాట్ యజమానుల వాదన

ప్లాట్ కొనుగోలు దారులు చెబుతున్నది సారాంశంగా ఇలా ఉంది:

మేము రిజిస్ట్రేషన్ ఆధారంగా కొనుగోలు చేశాం

దశాబ్దాలుగా పన్నులు చెల్లిస్తున్నాం

ప్రభుత్వ సేవలు పొందుతున్నాం

ఇళ్లు నిర్మించుకున్నాం

అందువల్ల మేమే చట్టబద్ధ యజమానులం మాకు రక్షణ కావాలి అని వారు కోరుతున్నారు.

సామాజిక ప్రభావం

ఈ కేసు కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కాదు.

ఇది ఒక పెద్ద సూత్రాన్ని నిర్ధారిస్తుంది:

పాత రిజిస్ట్రేషన్ల భద్రత

ప్రజల పెట్టుబడుల రక్షణ

పట్టణాభివృద్ధిపై నమ్మకం

వందల కుటుంబాల భవిష్యత్తు ఈ నిర్ణయంపై ఆధారపడి ఉంది.

తుది విశ్లేషణ

లభ్యమైన పత్రాలు, చరిత్ర, రిజిస్ట్రేషన్ ప్రక్రియల ఆధారంగా కనిపిస్తున్న ప్రధాన విషయం:

1984లో జరిగిన ప్లాట్ల విభజన చట్టబద్ధమైనదిగా పరిగణిస్తే

ఆ ప్లాట్లను కొనుగోలు చేసిన వారే అసలైన యజమానులు అవుతారు.

---

## శివాజీ ధీరత్వం విద్యార్థులకు స్ఫూర్తిదాయకం



బైంసా, ఫిబ్రవరి 19:ఛత్రపతి శివాజీ మహారాజ్ వీరత్వానికి, ధీరత్వానికి ప్రతీక అని, ఆయన జీవితం నేటి విద్యార్థులకు మార్గదర్శకమని శ్రీ సరస్వతీ విద్యాపీఠం ప్రాంత సంఘటన కార్యదర్శి పతకమూరి శ్రీనివాస్ రావు అన్నారు. గురువారం నిర్మల్ జిల్లా బైంసా పట్టణంలోని గుజిరి గల్లిలో గల శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

జిజియా మాత మార్గదర్శనంలో గొప్ప వీరుడిగా..

ముఖ్య వక్తగా విచ్చేసిన శ్రీనివాస్ రావు గారు మాట్లాడుతూ.. శివాజీ మహారాజ్ తన తల్లి జిజియా మాత మార్గదర్శనంలో, పురాణ గాథల స్ఫూర్తితో గొప్ప ఉత్తముడిగా ఎదిగారని కొనియాడారు. హిందూ సామ్రాజ్య స్థాపన కోసం అనేక రాజ్యాలను జయించిన అజేయ వీరుడని, ఆయన గుణగణాల వల్లే 'ఛత్రపతి'గా ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని పేర్కొన్నారు. విద్యార్థులు శివాజీ వంటి గొప్ప నాయకుల చరిత్రను చదవాలని, వారిలోని ధైర్యాన్ని, క్రమశిక్షణను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

ఈ వేడుకలో విభాగ్ కార్యదర్శి సరుకొండ దామోదర్, విభాగ్ శైక్షణిక్ ప్రముఖ్ కలిమహంతి వేణుమాధవ్ పాల్గొన్నారు. పాఠశాల సమితి ప్రబంధకారిణి సభ్యులు డి. శ్రీధర్, శివ కుమార్ బచ్చువార్, నూకల సురేష్, పి. కాశీనాథ్, తోట రాము, జి. లక్ష్మణ్ తదితరులు శివాజీ సేవలను స్మరించుకున్నారు.

పాఠశాల ప్రధాన ఆచార్యులు శ్రీరాముల గంగాధర్, బి. దేవేందర్, ఈ. హన్మండ్లు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు శివాజీ వేషధారణలో అలరించారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

---

## కొత్తపేట లో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు



కొత్తపేట.(బిఎన్ఎస్) : గో రక్షకులు ప్రముఖ హిందూ ధార్మిక నాయకులు కోటిపల్లి రఘురాం వేణుగోపాల్ ఆధ్వర్యంలో హిందూ సామ్రాజ్య స్థాపకుడు మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి . దీనికి ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం పాల్గొన్నారు ముందుగా బోడి పాలెం వంతెన సెంటర్ వద్ద శివాజీ మహారాజ్ ప్లెక్సీ కి పూలమాలలు వేసి అనంతరం ర్యాలీగా బయలుదేరి వాడపాలెం పంచాయతీ సెంటర్ వద్ద ఉన్న శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాల వేసి జై భవానీ వీర శివాజీ అంటూ కొనియాడారు . అనంతరం ఆరెస్సెస్ బౌద్ధ ప్రముఖ్ తొగరు సీతారామాంజనేయులు మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ (1630–1680) పశ్చిమ భారతదేశంలో మరాఠా సామ్రాజ్యాన్ని స్థాపించిన గొప్ప యోధుడని ఆయన ఫిబ్రవరి 19, 1630న శివనేరి కోటలో జన్మించిన శివాజీ, తల్లి జిజాబాయి, తండ్రి షాహాజీ భోంస్లేల మార్గదర్శకత్వంలో చిన్న వయస్సులోనే తోర్నా కోటను గెలిచి, గెరిల్లా యుద్ధతంత్రం (గోరిల్లా వార్‌ఫేర్) ద్వారా మొఘల్, బీజాపూర్ సుల్తానులను ఎదిరించి స్వరాజ్యాన్ని నెలకొల్పారని అన్నారు.

---

## నేడు వెంకటగిరిలో

### నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి జన్మదిన వేడుకలు



ఉమ్మడి నెల్లూరు జిల్లా వెంకటగిరి (బి.యన్.యస్) :- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి 91వ జన్మదిన వేడుకలు నేడు వెంకటగిరి పట్టణంలోని యన్.జె.ర్.బంగ్లా నందు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా వెంకటగిరి నియోజకవర్గ వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి పాల్గొననున్నారు. ముందుగా యన్.జె.ఆర్.బంగ్లా నందు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారు.ఉదయం తొమ్మిది గంటలకు కేకు కటింగ్, అనంతరం స్థానిక త్రిభువని సెంటర్లలోని నేదురుమల్లి జనార్దన్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించనున్నారు. అదేవిధంగా 11గంటలకు నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి విగ్రహం వద్ద అన్నదానం కార్యక్రమం నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమంలో వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, నేదురుమల్లి కుటుంభం అభిమానులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని నేదురుమల్లి కార్యాలయం నుండి కోరారు.

---

### ఆర్ఎస్ఎస్ సేవకుల పై

## కమ్యూనిస్టుల దాడి అమానుషం

### -బీజేపీ నేత మిడతల రమేష్




నెల్లూరు జిల్లా పొదలకూరు (బి.యన్.యస్):- ఆంధ్ర యూనివర్సిటీలో మంగళవారం నాడు ఆర్ఎస్ఎస్ శాఖ జరుగుతుండగా వామపక్షవాదులు స్వయం సేవకుల మీద దాడి చేయడం అమానుషమని దాడిని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని ఆ పార్టీ సీనియర్ నేత మిడతల రమేష్ అన్నారు. పొదలకూరు లో గురువారం ఆయన మీడియా తో మాట్లాడుతూ భరతమాతను కీర్తిస్తూ ప్రార్థన చేస్తున్న సమయంలో ఆ ప్రార్థన ను వినడానికి ఇష్టపడని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ ముసుగులో వామపక్షాల గుండాలు దాడి చేయడం బాధాకరమన్నారు. స్వయం సేవకుల మీద పడిన ప్రతి దెబ్బ భరతమాత మీద పడినట్లేనని తెలిపారు. సెక్యులరిజం ముసుగు ధరించుకొని భారతదేశ జీవన విధానానికి సంబంధంలేని విదేశీ సిద్ధాంతాలతో వామపక్షాలు కొనసాగుతున్నాయని అన్నారు. భరతమాతను కీర్తిస్తున్న వారిపై దాడి చేయడం అంటే భారతీయుల ఆత్మ మీద దాడి చేసినట్లు గా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు చింత గింజల సుబ్రమణ్యం, రాచపూడి ధనుంజయ రావు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

---

## హైవే నిర్మాణం అడ్డుకున్న స్థానికులు.

కడప జిల్లా చాపాడు మండలం కేతవరం గ్రామ సమీపాన గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే పనులను కేతవరం, లక్ష్మీపేట గ్రామస్తులు, అడ్డు కున్నారు . కేతవరం, లక్ష్మీపేట గ్రామాలనుండి అల్లాడుపల్లి, పెద్ద చియ్యపాడు గ్రామాలలో ఉన్న తన పొలములకు పోవుటకు దారి ఉండేదని నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హైవే వారు మా పోలాలకు పోకుండా ఆదారిని మూసివేస్తున్నారని, ఆ దారిని మూసివేయడం వల్ల మా పొలాలకు పోకుండా మాకు చాలా ఇబ్బంది కలుగుతుంది కాబట్టి లక్ష్మీపేట కేతవరం గ్రామస్తులమైన మేము ఈ రహదారి పనులను అడ్డుకుంటున్నామన్నారు. గతంలో రెండు మూడుసార్లు గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్ అశోక్ కుమార్ రెడ్డి కి రాతపూర్వకముగా అర్జీలు సమర్పించిన కూడా ఫలితం లేదన్నారు. కావున అధికారులు ఇప్పటికైనా లక్ష్మీపేట, కేతవరం గ్రామస్తుల మీద దయదించి మాకు ఈ దారిన గేదెలు, చెత్త బండ్లు వెళ్ళటానికి దారి కల్పించవలసినదిగా కోరారు.

# రాపూరుకలువాయి ప్రాంతాల్లో టూరిజం అభివృద్ధి చేయాలి



ఉమ్మడి నెల్లూరు జిల్లా వెంకటగిరి (బి.యన్.యస్):– వెంకటగిరి నియోజకవర్గంలోని వెనుకబడిన రాపూరు, కలువాయి మండలాలను పర్యాటక పరంగా అభివృద్ధి చేయాలని శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ గారు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక, ప్రకృతి సంపదలతో ప్రసిద్ధిగాంచిన ఈ ప్రాంతాల్లో టూరిజంను ప్రోత్సహిస్తే యువతకు ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని తెలిపారు.రాపూరు మండలంలోని పెంచలకోన నందు ఉన్న పెనుశీల లక్ష్మీనరసింహ స్వామి ఆదిలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం పవిత్ర క్షేత్రంగా ఉమ్మడి నెల్లూరు జిల్లాలోనే పేరు గాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమని పేర్కొన్నారు. 2024 ఎన్నికల ప్రచారంలో భాగంగా మన ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఇక్కడికి వచ్చి శ్రీపెనుశిల లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో స్వామివారిని దర్శించుకున్న విషయాన్ని గుర్తుచేశారు. ప్రకృతి అందాలు, కొండల మధ్య ఆధ్యాత్మిక వాతావరణం కలిగిన ఈ ప్రాంతాన్ని సమగ్ర పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే ఈ ప్రాంతానికి ఎంతో మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు.అదేవిధంగా కండలేరు ప్రాజెక్టు ప్రాధాన్యం గురించి మాట్లాడుతూ

1983లో అప్పటి ముఖ్యమంత్రివర్యులు పూజ్యులు స్వర్గీయ నందమూరి తారక రామారావు రాపూరు మండలం నందు కండలేరు జలాశయంను నిర్మించారని ఆయన పేర్కొన్నారు. చెన్నై ప్రజల తాగునీటి అవసరాలతోపాటు నెల్లూరు, తిరుపతి జిల్లాల ప్రాంత రైతులకు సాగునీరు, త్రాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రాజెక్టు రూపుదిద్దుకుందని చెప్పారు. చెన్నైకు పైపులైన్ల ద్వారా నీరు తరలించే ప్రతిపాదనలు వచ్చినప్పటికీ, స్థానిక రైతాంగాన్ని దృష్టిలో పెట్టుకుని కాలువ నిర్మాణానికి ప్రాధాన్యం ఇచ్చారని వివరించారు.అదేవిధంగా తెలుగుగంగ నీటితో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో సుమారు 1.80 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోందని గుర్తుచేశారు. గతంలో వర్షాధారంపై ఆదారపడి సజ్జ, రాగి, జొన్న వంటి వెల్ది పంటలు సాగు చేసిన రైతులు నేడు వరి పంటను రెండుకార్లు పండించగలుగుతున్నారంటే అది ఎన్టీఆర్ దూరదృష్టి ఫలితమని పేర్కొన్నారు.

అయితే ప్రస్తుతం కండలేరు డ్యాం మట్టికట్టకు రివెట్‌మెంట్ నిర్మించకపోతే కోతకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే రక్షణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.అదేవిధంగా వెంకటగిరి నియోజకవర్గంలోని కలువాయి మండలం గురించి మాట్లాడుతూ కలువాయి మండలంలోని పెన్నబద్వేలు, పెన్నానది వద్దున ఉన్న పురాతన దేవాలయాలను అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా కండలేరు డ్యాం, కలువాయి మినీ రిజర్వాయర్ వద్ద బోటింగ్ సదుపాయం, పార్కు ఏర్పాటు చేస్తే పర్యాటక అభివృద్ధికి దోహదపడుతుందని సూచించారు.అదేవిధంగా రాపూరు, కలువాయి మండలాల్లో భక్తులు ఆధ్యాత్మిక అనుభూతిని ఆస్వాదించడంతోపాటు ప్రకృతి సోయగాలను వీక్షించేలా సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందు దుర్గేష్ గారు కృషి చేయాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాంతం పర్యాటక పరంగా అభివృద్ధి చెందితే ఎంతోమంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు.

### ఉప్పాడ మత్స్యకారుల అభ్యున్నతికి ప్రణాళిక సిద్ధం

## డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

- తీర ప్రాంత మత్స్యకారుల సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా ప్రణాళికలు
- మత్స్యకారుల జీవితాలకు భద్రత.. భరోసా మా లక్ష్యం
- త్వరలో పిఠాపురం వేదికగా ప్రకటన



అమరావతి ఫిబ్రవరి 19.ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకార సోదరుల సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా సమగ్ర ప్రణాళికను రూపొందించామ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు.. అన్ని శాఖల సమన్వయంతో ఈ ప్రణాళికలు రూపొందించడం జరిగిందని, గత ఏడాది అక్టోబర్ 9వ తేదీ కాకినాడ కలెక్టరేట్ లో మత్స్యకారులు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చిన ప్రతి సమస్యకు పరిష్కార మార్గాలు అన్వేషించినట్లు పవన్ కళ్యాణ్ తెలిపారు.తీర కాలుష్య నివారణ, కోత నివారణ, మత్స్య సంపద వృద్ధి, అధునాతన పద్ధతులలో వేట, మార్కెటింగ్ సదుపాయాలు, ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణ, ఇలా మత్స్యకారులు జీవితాలకు భద్రత, భరోసా కల్పించేందుకు అవసరం అయిన ప్రతి అంశాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ ప్రణాళికలో పొందుపర్చామని,గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుపర్చడంతోపాటు వ్యవసాయ అభివృద్ధి, ప్రత్యామ్నాయ ఉపాధి కల్పన తదితర అంశాలను కూడా పరిగణలోకి తీసుకుని,


వివిధ శాఖల ఉన్నతాధికారులు, మెరైన్ ఫిషరీస్ నిపుణులు, జిల్లా అధికారుల సహకారంతో రూపొందించిన ఈ ప్రణాళికను వచ్చే పిఠాపురం పర్యటనలో ప్రకటించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నిర్దుష్ట లక్ష్యంతో రూపొందించిన ప్రణాళిక – ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకారుల జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నానని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు.

## “200 కోట్ల అభివృద్ధి ఎక్కడ..?

# కాలనీల్లో మురుగు నీరు ఎందుకు..?”

### మియాపూర్‌లో ప్రజల ఆగ్రహం ఐదు నెలలుగా ఎఫ్‌సీఐ కాలనీలో దుర్వాసన సమస్య





శేరిలింగంపల్లి (బిఎన్ఎస్):మియాపూర్ డివిజన్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చిన ప్రజాప్రతినిధులు, ఐదు సంవత్సరాల కాలంలో ప్రజా సమస్యలను గాలికి వదిలేసి అధికారాన్ని అడ్డుపెట్టుకొని కోట్లు సంపాదించుకున్నారే తప్ప, కాలనీల్లో కనీస మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేదని స్థానికులు మండిపడుతున్నారు.

త్రాగునీరు, డ్రైనేజ్ సమస్యలు అసంపూర్తిగానే మిగిలిపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఎఫ్‌సీఐ కాలనీలోని సెంట్ రీటా స్కూల్ వెనుక రోడ్డులో గత ఐదు నెలలుగా మురుగు నీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వ్యాపిస్తోంది.

ఈ సమస్యపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని స్థానికుడు ఎరవేని శ్రీకాంత్ యాదవ్ వాపోయారు. తాత్కాలికంగా సిబ్బంది వచ్చి చెత్తను తొలగించినా, రెండు రోజులకే మళ్లీ మురుగు నీరు చేరిపోతుందని ఆయన తెలిపారు. శాశ్వత పరిష్కారం కల్పించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఈ సందర్భంగా ఎంసీపీఐ నాయకులు పల్లె మురళీ మాట్లాడుతూ, “200 కోట్ల అభివృద్ధి చేశామని చెప్పుకునే నాయకులు ఉన్న చోటే మురుగు నీరు ఎందుకు నిలుస్తోంది?” అని ప్రశ్నించారు. ప్రజల ఆరోగ్యంతో ఆటలాడటం సరికాదని, వెంటనే శాశ్వత చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.ప్రజల సమస్యలపై సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## రాపూరు పంచాయతీపరిధిలో కోతులు, కుక్కలు సమస్యని పరిష్కరించండి



నెల్లూరు జిల్లా రాపూరు(బి.యన్.యస్):– నెల్లూరు జిల్లా రాపూరు పంచాయతీ పరిధిలోని కోతులు మరియు కుక్కల సమస్యతో పంచాయతీ పరిధిలోని ప్రజలు తీవ్రంగా ఎదుర్కొంటున్నారు అని నెల్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారి వసుమతి కి రాపూరు కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ సయీద్ వినతిపత్రం అందజేశారు. వెంటనే డి.పి.ఓ స్పందించి అటవీశాఖ అధికారులకు ఆదేశాలు జారీచేశారు.

# పోలీస్ వెల్ఫేర్‌వెల్‌నెస్ ఎక్స్‌పోకు విశేష స్పందన

### క్రీడోత్సవాల సందర్భంగా సైబరాబాద్ కమిషనరేట్‌లో సందడి





శేరిలింగంపల్లి: (బిఎన్ఎస్ ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర పోలీస్ క్రీడోత్సవాల నేపథ్యంలో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ‘పోలీస్ వెల్ఫేర్ & వెల్‌నెస్ ఎక్స్‌పో’కు పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో సిబ్బంది ఎక్స్‌పోను సందర్శిస్తూ వివిధ స్టాల్స్‌ను ఆసక్తిగా వీక్షిస్తున్నారు. ఆరోగ్య పరీక్షలు, పోషకాహార సూచనలు, ఫిట్‌నెస్ పరికరాలు, యోగావెల్‌నెస్ సేవలు, ఆర్గానిక్ ఉత్పత్తులు, ఆధునిక పోలీసింగ్ టెక్నాలజీలకు సంబంధించిన పలు స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ పోలీస్ స్టాల్‌లో ఆధునిక ట్రాఫిక్ అమలు పరికరాలు, డ్రంకెన్ డ్రైవ్ గుర్తింపు యంత్రాలు, స్పీడ్ లేజర్ గన్స్, బాడీ ప్రొటెక్షన్ సామగ్రి వంటి పరికరాలను ప్రదర్శిస్తూ వాటి వినియోగంపై ప్రత్యక్ష అవగాహన కల్పిస్తున్నారు.

జైలు శాఖ తయారు చేసిన ఉత్పత్తులు, ప్రత్యేక ఆపరేషన్ పరికరాలు, పోలీసింగ్‌లో ఉపయోగించే ఆధునిక సాంకేతిక పరికరాల ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. పోలీస్ విధుల్లో ఉపయోగించే రక్షణ సామగ్రి, టెక్నాలజీ ఆధారిత పరికరాలపై సిబ్బంది, కుటుంబ సభ్యులకు నిపుణులు వివరాలు అందిస్తున్నారు. పోలీస్ సిబ్బంది ఆరోగ్యం, సంక్షేమం, జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ ఎక్స్‌పోను నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. క్రీడోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శన పోలీస్ కుటుంబాలకు ఉపయోగకరంగా మారిందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఈ ఎక్స్‌పో శనివారం వరకు కొనసాగనుంది.

# శేరిలింగంపల్లిలో శివగర్జన!

## 396వ శివాజీ మహారాజ్ జయంతి వేడుకల్లో జనసంద్రం

### “జై శివాజీ జై భవానీ” నినాదాలతో కంపించిన మియాపూర్ నుండి తారా నగర్ వరకు మహా ర్యాలీ



శేరిలింగంపల్లి:(బీఎన్ఎస్ ప్రతినిధి) :ఛత్రపతి శివాజీ మహారాజ్ 396వ జయంతి వేడుకలు శేరిలింగంపల్లిలో చరిత్రాత్మకంగా నిర్వహించబడ్డాయి. మియాపూర్ డివిజన్ న్యూ కాలనీ శివాలయం వద్ద ప్రారంభమైన మహా ర్యాలీ తారా నగర్ తుల్జాభవాని ఆలయం వరకు అద్భుత ఉత్సాహంతో సాగింది. వేలాదిగా తరలివచ్చిన ప్రజలు “జై శివాజీ జై భవానీ” నినాదాలతో ప్రాంతాన్ని మార్మోగించారు.

ర్యాలీకి జెండా ఊపి ప్రారంభం చేసిన బీజేపీ శేరిలింగంపల్లి అసెంబ్లీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, ఇంఛార్జి రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ

“శివాజీ మహారాజ్ జయంతి అనేది పుట్టినరోజు కాదుఌ అది ధర్మ రక్షణకు చేసిన మహాప్రతిజ్ఞ విజయోత్సవం” అని ఘాటుగా పేర్కొన్నారు.

350 ఏళ్ల క్రితం దేవాలయాలను కూల్చివేసే శక్తులకు ఎదురు నిలిచి హైందవ స్వరాజ్యాన్ని స్థాపించిన ధీరుడే శివాజీ మహారాజ్ అని అన్నారు. నేటి భారతదేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో కాశీ విశ్వనాథ్ ధామ్ పునర్నిర్మాణం నుండి అయోధ్య రామమందిర నిర్మాణం వరకు జరుగుతున్న కార్యక్రమాలు అదే ధర్మరక్షణ స్ఫూర్తికి నిదర్శనమని తెలిపారు.

శివాజీ మహారాజ్ గెరిల్లా యుద్ధ తంత్రం ద్వారా శత్రువుల గుండెల్లో నిద్రపోయారని, అదే ధైర్యసాహసాలతో నేటి ప్రభుత్వం సర్జికల్ స్ట్రైక్స్ ద్వారా దేశ రక్షణలో ముందడుగు వేసిందన్నారు. భారత నౌకాదళ పితామహుడైన శివాజీ మహారాజ్ ముద్రను భారత నౌకాదళ పతాకంలో చేర్చడం గర్వకారణమని పేర్కొన్నారు.

శివాజీ మహారాజ్ ఒక ప్రాంతానికో, ఒక కులానికో పరిమితం కాదని, ఆయన స్వప్నం భారత స్వరాజ్యమని, ప్రతి భారతీయుడు దేశభక్తితో జీవిస్తూ దేశాన్ని విశ్వగురువుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.

ఈ మహా కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, డివిజన్ స్థాయి నాయకులు, వివిధ మోర్చాల ప్రతినిధులు, కార్యకర్తలు, విశ్వ హిందూ పరిషత్, భజరంగ్ దళ్ నాయకులు, అభిమానులు భారీగా పాల్గొన్నారు.



# పులుమామిడిలో ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు




బిఎన్ఎస్ ,పులుమామిడి: మండల పరిధిలోని పులిమామిడి గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ 396వ జయంతి వేడుకలను గ్రామ యువత ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ డి. నర్సింహులు, ఉప సర్పంచ్ బి. నాగిరెడ్డి, మరియు ఎ. వెంకట్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ నర్సింహులు మాట్లాడుతూ భారతదేశ వీరపుత్రులలో శివాజీ అత్యంత గొప్పవారని, 1630లో శివనేరి కోటలో జన్మించిన ఆయన స్వతంత్రాన్ని కాంక్షించిన ధీరుడని కొనియాడారు. మొఘల్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడి, మరాఠా సామ్రాజ్యాన్ని స్థాపించిన ఘనత ఆయనదేనని గుర్తుచేశారు. అనంతరం ఉప సర్పంచ్ నాగిరెడ్డి మాట్లాడుతూ శివాజీ మహారాజ్ ఒక గొప్ప నాయకుడని, 1674లో రాయగఢ్ కోటలో ఆయనకు పట్టాభిషేకం జరిగిందని పేర్కొన్నారు. శివాజీ చూపిన ధైర్యం, నిజాయితీ, మరియు న్యాయం నేటి తరానికి ఆదర్శమని, ప్రతి ఒక్కరూ ఆయన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో గ్రామ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు మరియు ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# కుత్బుల్లాపూర్‌లో ఘనంగా శివాజీ జయంతి వేడుకలు



బిఎన్ఎస్ :కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. నియోజకవర్గంలోని గాయత్రి నగర్, రాఘవేంద్ర కాలనీ, అయోధ్య నగర్, న్యూ ఎల్‌బీ నగర్, శ్రీరామ్ నగర్, సూరారం కాలనీ తదితర ప్రాంతాల్లో శివాజీ మహారాజ్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు నల్ల జై శంకర్ గౌడ్ మరియు పులి బలరాం ముఖ్య అతిథులుగా పాల్గొని, శివాజీ మహారాజ్ ధైర్యసాహసాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఛత్రపతి శివాజీ మహారాజ్ కేవలం ఒక రాజు మాత్రమే కాదని, ఆయన ధైర్యం, స్వాభిమానం మరియు ధర్మ పరిరక్షణకు నిలువెత్తు ప్రతీక అని కొనియాడారు. ఆయన చూపిన పోరాట పటిమ, ఆశయాలు ప్రతి హిందువుకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. నేటి సమాజంలో మన సంస్కృతి, సంప్రదాయాలు మరియు ధర్మాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ శివాజీ మహారాజ్ ఆదర్శాలను అనుసరించాలని వారు పిలుపునిచ్చారు. ముఖ్యంగా హిందువుల ఐక్యత గురించి ప్రస్తావిస్తూ, విభేదాలను పక్కన పెట్టి హిందూ సమాజం అంతా ఒక్కటిగా ముందుకు సాగినప్పుడే దేశం మరింత బలపడుతుందని వారు ఆకాంక్షించారు. ప్రతి హిందూ బంధువు సమాజ హితానికి, దేశాభివృద్ధికి బాధ్యతగా పనిచేయాలని కోరారు. ఈ వేడుకల ద్వారా యువతలో దేశభక్తి మరియు ధర్మ పరిరక్షణ భావనలు పెంపొందాలని, శివాజీ మహారాజ్ ఆశయాలు ప్రతి ఇంటికి చేరాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, యువత మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి



ఇనుగుర్తి,19 ఫిబ్రవరి (బిఎన్ఎస్): దేశభక్తి, ధైర్య సాహసాలతో హిందూ స్వరాజ్య స్థాపన చేసిన చక్రవర్తి చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను ఇనుగుర్తి మండల కేంద్రంలో చత్రపతి శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు చత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలవేసి, నివాళులు అర్పించారు. అనంతరం శివాజీ ధైర్యసహసాలను దేశసేవను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పల్లముల రాజేందర్, నదునూరి ప్రశాంత్, లింగాల సందీప్, గాడుదుల గణేష్, మట్టపల్లి హరీష్, కందుల నవీన్, బొల్లా హరీష్, రోహిత్,వీరన్న,రాజేష్, ప్రశాంత్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ బోర్డు తీరుతో 300 మంది విద్యార్థులకు తీవ్ర అన్యాయం

- ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచెర్ల రాంబాబు
- ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలకు కొమ్ముకాస్తున్న బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య...
- విద్యార్థి పరిషత్ కార్యకర్తల అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం...

బిఎన్ఎస్ :తెలంగాణ రాష్ట్రంలో ఇంటర్మీడియట్ బోర్డు నిర్వాకం వల్ల 300 మంది విద్యార్థుల భవిష్యత్ అగమ్యగోచరంగా మారిందని ఏబీవీపీరాష్ట్ర కార్యదర్శి మాచెర్ల రాంబాబు అన్నారు.ఏబీవీపీ ఆధ్వర్యంలో 300 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్షలు రాసే వెసులుబాటు కల్పించాలని,వారికి వెంటనే హాల్ టికెట్స్ జారీ చేయాలని డిమాండ్ చేస్తూ నేడు ఇంటర్మీడియట్ బోర్డును ముట్టడించడం జరిగింది. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ“ తెలంగాణ రాష్ట్రంలోని ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలకు కొమ్ముకాస్తున్నారని అన్నారు.అనుమతుల్లేని కళాశాలలు నడుస్తున్నా వాటిపై చర్యలు తీసుకోవట్లేదని, ఒకే పేరుతో పదుల సంఖ్యలో బ్రాంచ్ లు నడుపుతూ, ఒక కళాశాలలో అడ్మిషన్ తీసుకొని వేరొక కళాశాలలో చదువుచెప్తుంటే బోర్డు అధికారుల కళ్ళు మూసుకుపోయాయని ఎద్దేవా చేశారు.విద్యార్థులు పరీక్షల ఫీజులు కళాశాలల్లో చెల్లించినప్పటికీ,ఆ విద్యార్థుల పేర్లు బోర్డు వద్ద నమోదు చేపించకుండా కళాశాలలు నిర్లక్ష్యం చేస్తే వాటిపై కఠిన చర్యలు తీసుకోకుండా వాటికే వత్తాసు పలుకుతూ కనీసం విద్యార్థులు తమకు ఎగ్జామ్ రాసే అవకాశం కల్పించండి అడిగితే బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య కర్కశంగా వ్యవహరిస్తున్నారని, డబ్బులు విద్యార్థులు కోర్టుకు వెళ్లి అనుమతి తెచ్చుకున్నారని, డబ్బులు లేని పేద విద్యార్థుల సంగతేంటని నిలదీశారు.గత నాలుగు రోజులుగా కృష్ణ ఆదిత్య గారిని ఏబీవీపీ ఆధ్వర్యంలో కలిసే ప్రయత్నం చేస్తే తప్పించుకు తిరుగుతున్నారన్నారు. తప్పుచేసిన కళాశాలలపై చర్యలు తీసుకోకుండా,పేద విద్యార్థులు పరీక్షలు రాయకుండా చేయడం సిగ్గుచేటన్నారు. ప్రైవేట్,కార్పొరేట్ కళాశాలలకు బోర్డు సెక్రటరీ తొత్తుగా మారారని,వారి వద్ద నుండి ఎన్ని కమిషన్లు నొక్కుతున్నారో అర్థం కావడం లేదన్నారు.ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించే బోర్డు సెక్రటరీని వెంటనే తొలగించి, ఆ 300 మంది విద్యార్థులకు వెంటనే పరీక్షలు రాసే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.విద్యార్థులకు న్యాయం చేయాలని కోట్లాడుతున్న విద్యార్థి నాయకుల అక్రమ అరెస్ట్ లను ఏబీవీపీ తీవ్రంగా ఖండిస్తున్నదని,బేషరతుగా వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.విద్యార్థులకు



న్యాయం చేసే వరకు ఏబీవీపీ అండగా ఉంటుందని,విద్యార్థులకు పరీక్ష రాసే అవకాశం కల్పించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో మహానగర కార్యదర్శి పృథ్వీ తేజ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజు, విభాగ్ కన్వీనర్లు హరిప్రసాద్, నగేష్, జిల్లా కన్వీనర్లు భరత్, తేజా సాగర్,అఖిల్, వినయ్, మృత్యుంజయ, విక్రమాదిత్య, బాలకృష్ణ, స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్లు పూజిత్,అక్షిత మరియు హరీష్ సాగర్,దివ్యలత, శేఖర్, మణికంఠ, రాఘవేంద్ర, తరుణ్, ప్రీతం, రాహుల్, సుప్రజ్ తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు అతిక్రమిస్తే టిప్పర్లు సీజ్

**నార్సింగి ఏసీపీ జి.వి. రమణ గౌడ్ హెచ్చరిక**



బిఎన్ఎస్ ,నార్సింగి: రోడ్డు భద్రత మరియు నగర పరిశుభ్రతను దృష్టిలో ఉంచుకుని నార్సింగి ఏసీపీ కార్యాలయంలో ఎర్త్ మూవర్స్ (టిప్పర్) యజమానులతో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నార్సింగి ఏసీపీ జి.వి. రమణ గౌడ్ మరియు జోనల్ కమిషనర్ కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ.. టిప్పర్ వాహన యజమానులు మరియు డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆదేశించారు. ప్రతి వాహనానికి సంబంధించి ఆర్‌సీ , ఇన్సూరెన్స్ వంటి పత్రాలతో పాటు, డ్రైవర్లు విధిగా ఒరిజినల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా భవన నిర్మాణ వ్యర్థాలను తరలించే క్రమంలో అజాగ్రత్తగా వ్యవహరిస్తూ, రహదారులపై చెత్తను పడేసే వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. రోడ్లపై వ్యర్థాలను కుమ్మరిస్తే సదరు వాహనాలను వెంటనే సీజ్ చేస్తామని వారు తేల్చి చెప్పారు. భవన నిర్మాణ వ్యర్థాలను రోడ్ల మీద కాకుండా, కేవలం జి.హెచ్.ఎం.సి వారు కేటాయించిన గౌలిదొడ్డి ప్రాంతంలోని యార్డులో మాత్రమే పడవేయాలని డ్రైవర్లకు మరియు ఓనర్లకు సూచించారు. నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా టిప్పర్లను నిబద్ధతతో నడపాలని, అతివేగం మరియు అజాగ్రత్తగా నడిపితే సహించేది లేదని ఈ సమావేశంలో అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నార్సింగి డివిజన్ ఇన్‌స్పెక్టర్లు జి. హరికృష్ణ రెడ్డి, ఎం. బాల్ రాజ్, గణేష్ పటేల్ మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


# రక్తదానం ప్రాణదానం తో సమానం, ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్.



కూకట్ పల్లి ఫిబ్రవరి 19 (బిఎన్ఎస్) : చత్రపతి ధర్మరక్షణ సేన వ్యవస్థాపక అధ్యక్షులు కర్ర వేణుగోపాల్ ఆహ్వానం మేరకు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవాలలో భాగంగా మూసాపేట్, గూడ్స్ షెడ్ రోడ్ లోని పినాకిల్ క్యాంపస్ లో జరిగిన రక్తదాన శిబిరానికి జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు కూకట్పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై తల సేమియా సికిల్ సెల్ సొసైటీ డైరెక్టర్ రత్నావళి, పినాకిని గ్రూప్ ఆఫ్ కాలేజెస్ చైర్మన్ వై శ్రీదేవి లతో కలిసి ఛత్రపతి శివాజీ మహారాజ్ చిత్ర పటానికి పుష్పమాలలు అర్పించి ఘన నివాళులు అర్పించారు, అనంతరం ప్రేమ కుమార్ ను నిర్వాహకులు శాలువాతో సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ,”శివాజీ మహారాజ్ ధైర్యం, పరాక్రమం, స్వాభిమానమే మనకు ఆదర్శం. యువత దేశభక్తితో, నైతిక విలువలతో ముందుకు సాగాలి అని పేర్కొని, రక్త దానం చేసిన యువతకు సర్టిఫికెట్, పండ్లు ఇచ్చి, ఒక రక్తదానం ద్వారా ముగ్గురు ప్రాణాలను రక్షించే అవకాశం ఉంటుంది.తలసేమియా, ప్రమాదాలు, శస్త్రచికిత్సలు వంటి అత్యవసర పరిస్థితుల్లో రక్తం ఎంతో అవసరం అని తెలుపుతూ యువతను,నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కొల్లా శంకర్, బొగాది వెంకటేశ్వరరావు, వేముల మహేష్, పోలెబోయిన శ్రీనివాస్, మరియు చత్రపతి ధర్మ రక్షణ సేన ఉపాధ్యక్షులు గాలి అనిత,తాండూర్ సునీత, తాండూర్ శ్రీనివాసరాజు, నాగేశ్వర్ గుప్తా, పవన్, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు శుభవార్త



GOVERNMENT OF TELANGANA
ABSTRACT

TR&B (Housing) Department - INDIRAMMA INDLU – Permission to relax the condition of fresh grounding for the Indiramma Indlu (new) beneficiaries, who have already completed basements under Old Indiramma Scheme, Gruhalaxmi Scheme or on their own – Accorded – Orders - Issued.

TRANSPORT, ROADS & BUILDINGS (RH&C.A1) DEPARTMENT

G.O.Rt.No. 96 Dated: 17-02-2026

Read the following:-

1) G.O.Ms.No.25, T,R&B (RH&C.A1) Department, dt:21.06.2023.
2) G.O.Ms.No.33, T,R&B (RH&C.A1) Department, dt:31.07.2023.
3) G.O.Ms.No.48, T,R&B (RH&C.A1) Dept, dt:30.12.2023.
4) G.O.Ms.No.7, T, R&B (RH& C.A1) Department Dt.09.03.2024
5) From the Managing Director, TGHCL, Hyderabad, Lr.No.2673/TGHCL/E&P/ Gruhalakshmi/2023,dt:21.04.2025 and Lr.No.1116/TGHCL/E&P/ INDIRAMMA INDLU/ 2024, dated 25.11.2025.

* * * *

ORDER:

In the circumstances reported by the MD, TGHCL, Hyderabad in the reference 5th read above, and after careful examination of the matter, Government hereby permit the MD, TGHCL, Hyderabad to relax the condition of fresh grounding issued vide the G.O.Ms.No.7, T,R&B (RH&C.A1) Department, Dated 09.03.2024 for the Indiramma Indlu (new) beneficiaries, who have already completed till basement stage under Old Indiramma Scheme or Gruhalaxmi Scheme or on their own, so as to enable the above beneficiaries to resume construction from basement stage, subject to the following:

a) Plinth area shall be between 400 sft - 600 sft, as per Indiramma Indlu Scheme guidelines. In case the existing basement is below 400 sft, additional plinth beams shall be laid to bring it to a minimum of 400 Sft. Similarly, in case of larger basements, plinth area to be restricted to a maximum of 600 sft.
b) Since the construction is already taken up by the beneficiaries to basement level, they will not be released BL stage payment. Release of remaining Rs.4,00,000/- will be made on completion of successive stages. (RL - Rs.1 lakh, RC - Rs.2 lakh, Finishing - Rs.1 lakh)
c) The eligibility of the above beneficiaries will be re-verified through 360°.

2. The Managing Director, TGHCL, Hyderabad shall take necessary action accordingly.

(BY ORDER AND IN THE NAME OF THE GOVERNOR OF TELANGANA)

VP GAUTHAM
SECRETARY TO GOVERNMENT

To
The Managing Director, TGHCL, Hyderabad.
Copy to:
The P.S. to Secretary to C.M.
The P.S. to Minister (Revenue, I&PR and Housing)
The P.S. to CS to Government.
Sf/Sc.

//FORWARDED :: BY ORDER//

SECTION OFFICER



వనపర్తి ,19ఫిబ్రవరి, (బిఎన్ఎస్) : వివిధ దశల్లో నిర్మాణాలు ఉండి ఇందిరమ్మ బిల్లులు మంజూరి నిలిచిపోయిన ప్రతి ఒక్కరికి బేస్ మెట్ లెవెల్ ఖర్చు మినహాయించి ఆ పైన వున్న నిర్మాణాలకు సంబంధించి బిల్లులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం జి ఓ ఆర్ట్ నొమ్బెర్ 96 జారీ చేసింది దీంతో పలు దశలో ఉన్న ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలన్నింటికీ ఆయ దశలను బట్టి బిల్లులు మంజూరు అవుతాయని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.బిల్లులు మంజూరు కావడం లేదంటూ నిర్మాణాలను నిలుపుదల చేసిన ఇందిరమ్మ లబ్ధిదారులందరూ తిరిగి నిర్మాణాలను ప్రారంభించవచ్చునని ఆయన సూచించారు.

# యువతిపై ప్రేమఉన్మాది దాడి



సూర్యాపేట,ఫిబ్రవరి 19 (బిఎన్ఎస్): చివ్వేంల కుడకుడ గ్రామ పరిధి స్నేహ నగర్ నందు, ఓ ఇంట్లో యువతిపై జరిగిన దాడి ఘటనకు సంబంధించి సంఘటన స్థలాన్ని సూర్యాపేట, డిఎస్పి ప్రసన్నకుమార్ పరిశీలించారు. దాడి ఘటనకు సంబంధించిన వివరాలను సంబంధిత సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ ఎస్సై మహేష్ ని అడిగి తెలుసుకున్నారు. సంఘటన స్థలానికి క్లూస్, టీమ్స్ డాగ్ స్క్వాడ్ సిబ్బంది చేరుకొని ఆధారాలను సేకరించారు. ఈ సందర్భంగా, డిఎస్పి ప్రసన్నకుమార్ మాట్లాడుతూ, ఈ సంఘటనపై చివ్వేంల పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, నిందితుడపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇలాంటి ఘటనలకు పాల్పడితే జైలు శిక్షలు తప్పవని క్షణికావేశంతో భౌతిక దాడులకు పాల్పడుతూ, కేసులపాలు కావద్దని డిఎస్పి కోరారు.




# సినిమా న్యూస్


## అందుకే బ్రేకప్ అయ్యింది

టాలీవుడ్ యంగ్ బ్యూటీ మృణాల్ ఠాకూర్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఒక సంచలన విషయాన్ని బయటపెట్టారు. ఒక రిలేషన్‌షిప్‌లో అభద్రతా భావం ఎంతటి ప్రమాదకరమో వివరిస్తూ.. తన మాజీ ప్రియుడి వింత ప్రవర్తన వల్లే తన బంధం ముగిసిందని ఆమె షాకింగ్ కామెంట్స్ చేసింది. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మృణాల్ మాట్లాడుతూ.. బాలీవుడ్ స్టార్ హృతిక్ రోషన్ )సరసన 'సూపర్ 30' సినిమాలో నటిస్తున్న సమయంలో ఈ ఘటన జరిగిందని తెలిపింది. ఆ సమయంలో ఒక వ్యక్తితో ప్రేమలో ఉండేదాన్ని అని.. అయితే, గ్రీక్ గాడ్ లాంటి హృతిక్ పక్కన తానునటించడం చూసి, అతను తీవ్రమైన ఒత్తిడికి లోనయ్యాడని చెప్పింది. "తను ఒక స్టార్ హీరో సరసన నటిస్తోంది.. నేనెక్కడ వెనుకబడిపోతానో" అనే భయంతో తనను తాను నిరూపించుకోవడానికి జిమ్‌లో కఠిన కసరత్తులు చేసి ఏకంగా 20 కిలోల బరువు తగ్గాడని మృణాల్ వెల్లడించింది.

అయితే ఆ ప్రయత్నం ఎంతో కాలం సాగలేదు. కొన్ని రోజులకే అతను మళ్ళీ బరువు పెరగడం చూసి ఆశ్చర్యపోయానని పేర్కొంది. ఎందుకు ఇలా చేస్తున్నావని ప్రశ్నించగా.. "నీ చుట్టూ ఉండే సినీ స్టార్లతో నేను పోటీ పడాలనుకున్నాను, వాళ్లలా మారాలని ప్రయత్నించాను. కానీ నా వల్ల కావడం లేదు. అందుకే జిమ్ మానేశాను" అని అతను నిరాశగా సమాధానమిచ్చాడని.. అందం, ఫిట్‌నెస్ విషయంలో ఇతరులతో పోల్చుకోవడం వల్ల అతను ఎంతటి మానసిక వేదనకు గురయ్యాడో తన కళ్లతో చూశానని మృణాల్ పేర్కొంది. నేను ఆ బంధంలో ఎంత నిజాయితీగా ఉన్నప్పటికీ, తనను తాను ఇతరులతో పోల్చుకునే అతని బలహీనతే తాము విడిపోవడానికి కారణమైందని మృణాల్ ఆవేదన వ్యక్తం చేసింది. కేవలం సౌందర్యం కోసం పాకులాడుతూ మనిషి తన వ్యక్తిత్వాన్ని ఎలా కోల్పోతాడో తన మాజీ ప్రియుడి ఉదాహరణతో ఆమె వివరించింది. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి.



## రక్తపాతంలో టాక్సిక్ వేట





కేజీఎఫ్ సెన్సేషన్ రాకింగ్ స్టార్ యష్, బాక్సాఫీస్ వద్ద తన అసలు సిసలు విశ్వరూపం చూపించడానికి 'టాక్సిక్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఈ మూవీకి సంబంధించిన ప్రతి అప్‌డేట్ ఇప్పుడు ఇంటర్నెట్‌ను ఊపేస్తోంది. తాజాగా, ఈ సినిమా టీజర్ అప్డేట్ రాబోతున్నట్లు మూవీ మేకర్స్ ప్రకటించారు. ఈ భారీ యాక్షన్ థ్రిల్లర్ టీజర్‌ను ఫిబ్రవరి 20న ఉదయం 9:35 గంటలకు విడుదల చేస్తున్నట్లు మేకర్స్ వెల్లడించారు. టీజర్ అప్‌డేట్ కోసం వదిలిన పోస్టర్ చూస్తుంటే గూస్‌బంప్స్ వచ్చేలా ఉంది. మంచు కురుస్తున్న ప్రాంతంలో యశ్ చాలా కూల్‌గా ఆల్కహాల్ తాగుతూ కనిపిస్తున్నారు. కానీ ఆయన ముందు మాత్రం రక్తం నదిలా పారుతోంది. ఈ విజువల్ చూస్తుంటే సినిమాలో యాక్షన్ ఏ రేంజ్‌లో ఉండబోతుందో అర్థమవుతోంది. మత్తులో ఉన్న రాకీ భాయ్ టీజర్‌తో రక్తపాతం మొదలెట్టబోతున్నారని పోస్టర్ చూస్తే అర్థమవుతోంది.

'పెద్దల కోసం ఒక అద్భుత కథ' అనే ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ చిత్రం, 1970ల నాటి గోవా డ్రగ్ మాఫియా నేపథ్యంలో సాగనుంది. దర్శకురాలు గీతూ మోహన్ దాస్ ఈ చిత్రాన్ని హాలీవుడ్ స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. ఇందులో నయనతార, కియారా అద్వానీ, రుక్మిణి వసంత్, తారా సుతారియా, హ్యూమా ఖురేషి వంటి స్టార్ హీరోయిన్లు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాలో యష్ మునుపెన్నడూ చూడని విధంగా కనిపించబోతున్నారు. ఇప్పటికే ఈ చిత్రంపై కొన్ని వివాదాలు నడిచినప్పటికీ, టీజర్ అప్‌డేట్‌తో వాటన్నిటికీ ఫుల్‌స్టాప్ పెట్టేశారు. కె.వి.ఎన్ ప్రొడక్షన్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే నెల మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

## ది కేరళ స్టోరీ 2'కు సెన్సార్ క్లియరెన్స్

మనోజ్ బాజ్‌పేయి చిత్రం 'ఘూస్‌ఖోర్ పండత్' టైటిల్‌పై సుప్రీంకోర్టు ఆంక్షలు విధించిన తరుణంలో మరో వివాదాస్పద చిత్రం 'ది కేరళ స్టోరీ 2' విడుదలకు లైన్ క్లియర్ అయింది. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు 'యూ/ఏ' సర్టిఫికెట్‌ను జారీ చేసింది. దీనివల్ల 14 ఏళ్లు పైబడిన వారు ఈ సినిమాను వీక్షించే అవకాశం లభించినట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ నిర్ణయంపై చిత్ర నిర్మాత విపుల్ అమృత్‌లాల్ షా స్పందిస్తూ, సెన్సార్ బోర్డు తమ కథలోని నిజాయితీని నమ్మిందని, బోర్డు సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు.

మత మార్పిడి వంటి సున్నితమైన అంశాలతో రూపొందిన ఈ చిత్రంపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఇప్పటికే తీవ్ర విమర్శలు చేశారు. ఇది రాష్ట్రాన్ని కించపరిచేలా ఉన్న 'విద్వేషపూరిత ప్రోపగాండా' అని ఆయన అభివర్ణించారు. కేరళలోని లౌకిక సంప్రదాయాన్ని దెబ్బతీసేందుకు ఇలాంటి సినిమాలు ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు. అయితే నిర్మాత విపుల్ షా మాత్రం, ఈ సినిమా యువతులకు మరియు కుటుంబాలకు అవగాహన కల్పించేందుకు ఉద్దేశించినదని అందుకే సెన్సార్ బోర్డు సానుకూలంగా స్పందించిందని అభిప్రాయపడ్డారు. కామఖ్య నారాయణ్ సింగ్ దర్శకత్వంలో ఉల్కా గుప్త, అదితి భాటియా మరియు ఐశ్వర్య ఓజా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాను విపుల్ షా నిర్మించాడు. ఈ చిత్రం ఫిబ్రవరి 27, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.




## ఆ స్టార్ హీరో అంటే చాలా ఇష్టం

టాలీవుడ్ యువ నటుడు అశోక్ గల్లా ప్రధాన పాత్రలో రూపొందిన దేవకి నందన వాసుదేవా అనే చిత్రంతో మానస వారణాసి తెలుగు సినీ పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ సినిమా పెద్ద స్థాయి విజయాన్ని సొంతం చేసుకోలేదు. దానితో ఈ బ్యూటీకి ఈ మూవీ ద్వారా పెద్దగా గుర్తింపు దక్కలేదు. ఈ సినిమా తర్వాత ఈమెకు కాస్త ఎక్కువగానే గ్యాప్ వచ్చింది. తాజాగా ఈమె సంతోష్ శోభన్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన కపుల్ ఫ్రెండ్లీ చిత్రంలో హీరోయిన్గా నటించింది.

తాజాగా విడుదల అయిన ఈ సినిమాకు మంచి టాక్ రావడం జరిగింది. ఈ చిత్రంలో ఈమె తన నటనతో ప్రేక్షకులను బాగా ఆకట్టుకోవడం వల్ల ఒక్కసారిగా మానసకి టాలీవుడ్ ఇండస్ట్రీలో మంచి గుర్తింపు దక్కింది. ప్రస్తుతం కపుల్ ఫ్రెండ్లీకి మంచి ప్రేక్షకాదరణ దక్కుతుండడంతో ఈ ముద్దుగుమ్మ ఈ సినిమాకు సంబంధించిన ప్రమోషన్లను పెద్ద ఎత్తున నిర్వహిస్తూ వస్తుంది. తాజాగా ఈమె ఓ ఇంటర్వ్యూలో పాల్గొంది. అందులో ఈమెకు తెలుగు సినిమా పరిశ్రమలో ఏ నటులు అంటే ఇష్టం? ఎవరితో సినిమా చేయాలని ఉంది అనే విషయాలను తెలియజేసింది.

తాజాగా మానస వారణాసి మాట్లాడుతూ... నేను చిన్న వయసు నుండి టాలీవుడ్ స్టార్ హీరోలు అయినటువంటి మహేష్ బాబు, నాగార్జున, వెంకటేష్ సినిమాలు చూస్తూ పెరిగాను. వారి నటన చాలా ఇష్టం. వారిపై నాకు ఎంతో గౌరవం ఉంది. ఇక నాకు మహేష్ బాబు గారు అంటే చాలా చాలా ఇష్టం. ఆయనతో కలిసి నటించే అవకాశం వస్తే బాగుంటుందని అనుకుంటున్నట్లు ఈమె తాజాగా చెప్పుకొచ్చింది.

